# 2. మంద

**స్వార్థపరాయణత్వం ముదిరిన సభ్య సమాజంలో ఏటికి ఎదురీదే వ్యక్తి ఒంటరిగా మిగిలిపోతున్నాడు. సంకుచిత భావజాలం మనుషుల్ని సంఘటితం కాకుండా చేస్తోంది.**

బ్యాంకులో అలజడిగా ఉంది.

రెండు నెలలబట్టి అలాగే ఉంది.

"మీ పనులు 30 నిమిషాలలో పూర్తికాకపోతే మేనేజరు గారిని కలవండి." అన్న బోర్డు అలాగే ఉంది. ఎవరూ దానిని తొలిగించనూలేదు. పట్టించుకోనూలేదు.

పదిహేను సంవత్సరాల కింద రిటైరైన రైల్వే ఉద్యోగులకు ప్రభుత్వం ఒక సదుపాయం కల్పించింది. వాళ్ళు పింఛన్లను బ్యాంక్ ద్వారా తీసుకోవచ్చు.

మొదటి నూరు మంది పింఛనుదారులలోనూ మూర్తి ఒకడు. తొలి రోజుల్లో అతను తీరిక చూసుకొని పింఛను తీసుకునేవాడు.

నాలుగైదు సంవత్సరాలలో రైల్వే పింఛనదారుల సంఖ్య పెరిగింది. బ్యాంక్ పరిసరాలలో చాలామంది రైల్వే పనివాళ్లు ఉండడమే అందుకు కారణం.

ఒకసారి మూర్తికి డబ్బు కావలసి ఒకటో తారీఖునే బ్యాంకుకు వెళ్ళాడు. అప్పటికి వెయ్యిమంది వరకు పింఛనుదారులు నమోదై ఉన్నారు. వాళ్ళలో చాలామంది ఆడవాళ్లున్నారు. అతను ప్యాసు పుస్తకం కౌంటర్లో ఇచ్చి, తన పేరు పిలిచేవరకు కుర్చీలో కూర్చున్నాడు. నలుగురైదుగురు ఆడవాళ్ళు అతని దగ్గరికి వచ్చి విత్‌డ్రాయల్ ఫారాలు నింపించుకున్నారు. ఆపాటి సహాయానికే వాళ్ళు సంతోషించారు. నెలకో నాలుగైదు రోజులు ఇటువంటి సహాయం అందజేస్తే బాగుండునని అతనికనిపించింది.

రైల్వే పింఛనుదారుల సంఖ్య పెరగడంతో, బ్యాంక్ అధికారుల ఆవరణలో షామియానాలు కట్టించి, కుర్చీలు వేసి చల్లని మంచినీటిని ఏర్పాటుచేశారు.

రైల్వేవాళ్ళు ఉద్యోగాలలో ఉన్నప్పుడు అప్పులు చేయడానికి అలవాటుపడ్డారు. రిటైరైన తరువాత కూడా దాని నుంచి బయటపడలేదు. బ్యాంకువారు మెడికల్ సర్టిఫికెట్ల మీద అప్పులిస్తారు. ఆ సదుపాయం అందరూ వినియోగించుకొనేవారు. బ్యాంక్ దగ్గర ఒక ప్రబుద్ధుడున్నాడు. అన్ని పనులూ చేయించి, ఒక్క రోజులో అప్పు ఇప్పించి ఒక్క నూరు రూపాయలు మాత్రమే అతను తీసుకునేవాడు. ఈ సంగతి మూర్తికి తెలిసి డాక్టరు ఫీజు తప్ప మిగిలిన ఖర్చులు లేకుండా అప్లికేషన్లు నింపి, బ్యాంక్ అధికారులతో చెప్పి సహాయం చేసేవాడు.

మూర్తికి ఈ నిస్వార్థసేవలో మనసుకు తృప్తి లభించేది. తనకన్నా ముందు రిటైరైన

వాళ్ళు కొద్దిమందే అయినా, క్రమంగా తనతో పనిచేసినవాళ్ళు, తనకు జూనియర్లు, తనకింద పనిచేసినవాళ్ళు ఉద్యోగాల నుంచి రిటైరై తప్పనిసరిగా బ్యాంక్ దగ్గర కలిసేవాళ్ళు. నలుగురు పాత ఉద్యోగులు కలవడం, ఒకరినొకరు కుశలప్రశ్నలు వేసుకోవడం, పిల్లల గురించి, ఆరోగ్యం గురించి మాట్లాడుకోవడం – ఇవన్నీ పెళ్ళిలో అందరు బంధువులు కలుసుకున్నట్లే ఉండేది. ఉద్యోగం నాటి సంగతులు మరచిపోకుండా జ్ఞాపకం తెచ్చుకుంటూ ఆనందించడం మూర్తికి చాలా హాయి కలిగించేది.

జబ్బుతో తీసుకొని రాలేకపోయినవాళ్ళు, కిందటి నెల కనిపించి ఈ నెల కనిపించనివాళ్ళు అప్పుడప్పుడు విచారానికి కారణమైనా. కొత్తవాళ్ళు చేరుతుండడంతో ఆ లోటు భర్తీ అయ్యేది.

ఇప్పుడు రమారమి మూడువేలమంది రైల్వే పింఛనుదారులు ఆ బ్యాంకుకు వస్తున్నారు.

అన్నీ సాఫీగా జరుగుతున్న బ్యాంకులో రెండు నెలలబట్టి కొత్త ఇబ్బంది ఒకటి తలెత్తింది. ఇన్ని సంవత్సరాలబట్టి ఎటువంటి ఆటంకం లేకుండా సాధ్యమైనంత త్వరలో పెన్షన్ బట్వాడా అయ్యేది. మొదటి తారీఖున బ్యాంక్ తలుపులు తెరిచేసరికి హాజరై ఉంటే పన్నెండులోగా డబ్బు ముట్టేది. కానీ, ఈ రెండు నెలలబట్టి నెల మొదటి వారంలోనేకాక, నెల పొడుగునా అదే ఇబ్బంది ఎదురవుతున్నది. పొద్దున్న పది గంటలకు క్యూలో నిలబడితే, ప్యాసు పుస్తకం సమర్పించుకునేసరికి రెండు గంటలు, చేతికి డబ్బు అందేసరికి మరొక గంట అవుతున్నది.

పెన్షన్లు ఇచ్చే హాలులో ఏభై కుర్చీలవరకు వేశారు. పైన మరో వంద. పూర్వం అందరి ప్యాసు పుస్తకాలు తొందరగా తీసుకొని, టోకెన్లు ఇచ్చి, చాలామందికి వెంటవెంటనే పేమెంట్లు చేసేవారు. కానీ, ఈ రెండు నెలల బట్టి బ్యాంక్ ఉద్యోగులు చాలా శ్రద్ధతో పని చేస్తున్నారు. ఒక పద్ధతిలో పని చేస్తున్నారు. రోజుకు నాలుగు వందల పెన్షన్లను మించి బట్వాడా చేయడం లేదు.

బ్యాంక్ ఉద్యోగులు సావకాశంగా పది గంటలకు దుకాణం తెరుస్తున్నారు. పదిన్నర వరకు టేబుళ్ళ తుడవడం, రికార్డులు సర్దుకోవడం చేస్తున్నారు. ఒకటి తరువాత ఒకటి పది పుస్తకాలు తీసుకుంటున్నారు. ప్రతి విత్‌డ్రాయల్ ఫారాన్ని పరీక్షాపత్రం వలె దీక్షగా పరిశీలించి, చిన్న చిన్న తప్పులు సరిచేయించి టోకెన్ ఇస్తున్నారు. ప్రతి ప్యాసు పుస్తకంలోని ఎంట్రీలు నాలుగుసార్లు చూడడం, తరువాత లెడ్జరు తెరిచి మరి కొంతసేపు కాలం గడిపి పని చేస్తున్నారు.

పూర్వం పైన వివరించిన పనంతా చాలా వేగంగా జరిగేది. ఇప్పుడు అదే పని

రెండు గంటలు పడుతున్నది. ప్యాసు పుస్తకాలు క్యాషియరుకు చేరడమో అరగంట - తరువాత పదిమందికి పేమెంట్లు చెయ్యడం - పది నిమిషాలు ఒక మనిషి కింద - ఈ విధంగా పనులు జరుగుతున్నాయి. క్యాషియర్లలో పురుషులున్నారు, స్త్రీలు కూడా ఉన్నారు. ఎవరైతేనేం, క్యాషియర్ అన్న మనిషి ప్రతి కరెన్సీ నోటును చాలా జాగ్రత్తగా పరిశీలించి, రెండుసార్లకు బదులు మరో రెండుసార్లు, ఇంకా అనుమానమైతే మరో రెండుసార్లు ప్రతి కరెన్సీ నోటులోనూ ఎవరో ప్రియమైనవారి బొమ్మ ఉన్నట్లు తదేకధ్యానంతో చూస్తూ, ఆ పదిమందికీ పేమెంట్లు చేస్తున్నారు. పదిమందికి పుస్తకమిచ్చిన దగ్గర నుంచి డబ్బు అందేవరకు గంటన్నరకు పైగా అవుతున్నది. క్యూలో నిలుచున్న కాలం దీనిలో చేరలేదని మనవి.

పెన్షన్లు ఇచ్చే హాలులోను, బయట కుర్చీలుండేవి. రోజుకి వందలకొద్దీ - మొదటి మూడు రోజులలోను వచ్చేవారు. కాబట్టి, అదృష్టవంతులైన కొద్దిమందికి కుర్చీలు దొరికితే, మిగిలనవాళ్ళందరూ క్యూలో నిలబడక తప్పడం లేదు. పింఛనుదారులలో నూటికి తొంభై తొమ్మిది మంది అరవై దాటినవాళ్ళే అవడం నుంచి వాళ్ళ కష్టాలు విపరీతంగా పెరిగిపోయాయి. మోకాళ్ళ నొప్పులవాళ్ళు, నడ్డినొప్పులవాళ్ళు, వాతపట్లవాళ్ళు మూడేసి గంటలసేపు క్యూలో నిలబడలేకపోయేవారు.

మొదటి నెల ఈ పద్ధతి వింతగా అనిపించింది. పరిస్థితులు రెండో నెలలో ఇంకా బిగిసిపోయాయి. అందరూ మూర్తివంటివాళ్ళే ఉంటారా? కొందరు నోరు పారేసుకున్నారు. కొందరు ఆగ్రహోదగ్రులయ్యారు. కొందరు నిలబడలేక, కూర్చోడానికి చోటులేక త్రాహిత్రాహి అన్నారు. క్యూలో నిలుచోని, నిలుచోని చివరకు కౌంటర్ చేరుకునేసరికి శక్తి లేక, ఒక బరువైన మనిషి నిలువునా పడిపోయి, తెలివి తప్పిపోయింది. ఆమెను లేవనెత్తడం, చాలా కష్టమయింది. ముఖంమీద నీళ్ళు చల్లి, ఆమెకు సోడా తాగించేసరికి ప్రళయమయింది.

ఇవన్నీ శారీరకమైన శ్రమలు, ఆనాటికి ఎంత శ్రమపడినా పింఛనురాళ్ళు తీసుకెళ్ళకపోతే పస్తులుండవలసినవాళ్ళు, డబ్బు లేకపోతే ఇంట్లో అడుగుపెట్టనివ్వని కోడళ్ళు, డబ్బు తేలేదని తన్ని తగలేసిన సుపుత్రులు, మందుకు కూడా పైసా లేని దౌర్భాగ్యులు - ఈ పింఛను దొరికే రోజు కోసమే జీవిస్తున్న వాళ్ళ బాధలు చెప్పుకోలేనివి.

బ్యాంక్ ఉద్యోగులు చాలా శాంతంగా, ఎటువంటి పరిస్థితులకూ చలించకుండా, నవ్వుతూ ఎంతమంది మీద పడి అరిచినా పట్టించుకోకుండా పని చేసుకుపోతున్నారు.

రెండో నెల పింఛనుదారుల ఇక్కట్లను చూస్తూ మూర్తి ఊరుకోలేకపోయాడు. మేనేజరుగారిని కలిసి ఇబ్బందులను ఏకరవుపెట్టాడు.

"మూర్తిగారూ, మీరు రైల్వేలో చాలాకాలం పనిచేశారు. చాలా సమ్మెలను చూశారు. సమ్మెలు కానటువంటి, 'వర్క్ టు రూల్' అన్న అవరోధాలను చూశారు. బ్యాంకుకి, రైల్వేకి

తేడా ఏముంది?"

"ఎన్నాళ్ళీ ఇబ్బంది?"

"మా ప్రయత్నాలు మేం చేస్తున్నాం. కొంచెం ఓపిక పట్టాలి."

రెండో నెలంతా అలాగే గడిచింది.

కేవలం పింఛను శాఖలోనే ఈ ఇబ్బంది కనిపించినట్లయింది, మిగిలిన కౌంటర్లలో విలువైన ఖాతాదారులకు, వారి స్నేహితులైన బ్యాంక్ ఉద్యోగులకు మధ్య అన్ని పనులూ సజావుగానే జరిగిపోతున్నాయి.

మరి ఈ పెన్షన్ బ్రాంచికే ఈ శాపమెందుకు?

అప్పుడతనిక నిపించింది.

నోరులేని దౌర్భాగ్యులు వీళ్ళు.

వయసు మళ్ళిన జీవచ్ఛవాలు.

కసాయివాడి కబేళాకు పోతున్న మేకలు.

వీళ్ళెవరినెదరించగలరు?

మూడో నెల మొదటి వారంలో ఈ ముసురు వెలిసి, కనీసం మానవ హృదయాలలో అంతర్గతంగా ఉన్న కరుణ వంటిది ఉద్యోగులలో కలిగి, వచ్చినవాళ్ళందరూ పింఛను తీసుకుపోతే బాగుండునని మూర్తి వేయి దేవుళ్ళకు మొక్కుకున్నాడు.

ఇబ్బందికి గురైనవాళ్ళు మరెవరో కారు - తన అన్నలు, తన తమ్ముళ్ళు, తన అక్కచెల్లెళ్ళే ఎటువంటి దారుణమైన పరిస్థితులలోనైనా, తనకు అండగా నిలచి పనిచేసినవాళ్ళే, వాళ్ళిలా బాధపడుతుంటే, ఆ నోరులేని గొర్రెలు...

అతని కళ్ళంట ధారాసోతంగా నీళ్ళు కారాయి.

వీరందరి చేత సమ్మె చేయిస్తే!

ఏం ప్రయోజనం?

ప్రభుత్వానికీ నష్టం లేదు, బ్యాంకుకీ నష్టం లేదు.

ఇచ్చినది పుచ్చుకోడమే విధి.

ఈ పింఛనుదారులకు హక్కులంటూ లేవు.

అసలు ఎవరి ఇంట్లో వారు రెండో తరగతి పౌరులు, మనుమల నుంచి సుపుత్రుల వరకు - అందరి అవసరాలు తీరిన తరువాతే వీరి గురించి పట్టించుకుంటారు. అది కూడా లేనివాళ్ళు చాలామంది.

మూర్తి ముందుగానే వాకబు చేశాడు

ఉద్యోగుల యూనియన్‌కి, అధికారులకు మధ్య వైషమ్యాలు పెరిగాయి. ఒడంబడిక

కుదరలేదు. ఇంకా రెండు నెలల వరకు పరిస్థితులు మెరుగు పడేటట్లు లేవు.

ఒకటో తారీఖు అయిదు రోజులే ఉంది.

మూర్తి ఒక రాత్రంతా ఆలోచించాడు.

ఏమీ చేయలేని పరిస్థితి.

రెండు రోజులు అతను తనకు తెలిసిన వాళ్ళనందరినీ కలిశాడు. కానీ, ఎవరూ ఈ సమస్యకు పరిష్కారం చూపించలేకపోయారు.

ఒక అర్ధరాత్రి అతనికి తెలివి వచ్చింది.

పింఛనుదారులు ఏమీ చెయ్యలేకపోయినా, కలిసికట్టుగా తమ నిరసన అయినా బ్యాంక్ అధికారులకు తెలియజేయాలి.

అతను మరి పడుకోలేదు.

అర్జీ ఒకటి తయారుచేశాడు. మూడు వేలలో కనీసం ఒక వెయ్యిమంది నిలబడినా చాలు.

ఈ మధ్య ఒకటో తారీఖు ముందు రోజున కూడా పింఛన్లిస్తున్నారు.

మూర్తి మహా ప్రయత్నం చేశాడు.

ఆ రోజులు కొద్దిమంది ఎలాగో పింఛన్లు తీసుకున్న, చాలామందిని ఆపు చేసి, అర్జీనిచ్చి, సంతకాలు పెట్టించి, బ్యాంక్ వ్యాపారాన్ని, అంటే పింఛను శాఖ యొక్క తతంగాన్ని అతను కానియ్యలేదు.

ఇవాళ ఒకటో తారీఖు

అగ్ని పరీక్ష.

మూర్తి అందరినీ పోగుచేస్తున్నాడు. పది గంటలకు బ్యాంక్ తెరిచినా, చెల్లింపులవారు డబ్బుతో సిద్ధంగా ఉన్నా, ఒక పింఛనుదారు కూడా లోపలికి వెళ్ళి ప్యాను పుస్తకం ఇవ్వడం లేదు.

అదీ గొడవ.

అటెండెంట్ సింహాద్రి రెండు అంగలలో మెట్లెక్కి, మేడ మీదికి పోయాడు. కింద గలభా ఏమని మేనేజరుగారు అడిగారు.

“సార్! ఆ ముసిలాడు మూర్తి - కాలు విరిగి కర్ర పట్టుకొని మీ దగ్గరకి వచ్చి, ప్రతి పింఛనుదారుకి ఋణాలిమ్మని సిఫారసు చేసిన పెద్ద మనిషి - ఇప్పుడీ అలజడికి నాయకుడు సార్! అతను గుమ్మం దగ్గర నిలబడి అందర్నీ లోపలికి పోకుండా అవుతున్నాడు. ప్రతి ఖాతాదారు చేతిలోనూ ఒక అర్జీ - బ్యాంక్, పింఛనుదారులకు చాలా ఇబ్బందులు కలిగిస్తున్నదని, అందుచేత అకౌంట్లు మూసేసి, తమకి ఫైనల్ పేమెంటు చేయమని సంతకాలు

చేసి, పాసు బుక్కులు, విత్‌డ్రాయల్ ఫారాలతో అందరూ సిద్ధంగా ఉన్నారు. మీ కోసం క్యాషియర్లు, అకౌంటెంట్లు చూస్తున్నారు సార్."

మేనేజరుగారు పళ్ళు పటపట కొరికారు.

"ఎందుకూ పనికిరాని, రిటైరైన ముసిలాడికి ఇంత పొగరా?"

మేనేజరుగారు ఆ విధంగా పైకే అన్నారు. తొందరగా మెట్లు దిగి కిందికి వచ్చారు.

పింఛను శాఖకు పోయే ద్వారం మనుషులతో మూసుకుపోయింది.

మేనేజరుగారు మరో వెనుక ద్వారం గుండా పింఛను శాఖలోకి ప్రవేశించారు. కౌంటర్ ముందు నిలబడ్డారు. ఎదురుగుండా ద్వారం దగ్గర నిలుచున్న మూర్తిని, అతని వెనుకనున్న జనసందోహాన్ని అతను సావకాశంగా పరికించారు. ముఖానికి చిరునవ్వు పులుముకున్నారు.

'మా ఖాతాదారులందరికీ స్వాగతం. పింఛను కౌంటర్ తెరిచి అరగంటపైగా అయింది. మీ అందరికీ వచ్చిన ఇబ్బంది ఏమిటో నాకు తెలియదు. మీ సేవ చేయడమే మా కర్తవ్యం" అన్నారు మేనేజరుగారు.

అతను అందరివేపు చూశారు. ఎవరూ మాట్లాడలేదు. ప్రతిమనిషి చేతిలోనూ అర్జీ, ప్యాసు పుస్తకం, విత్‌డ్రాల్ ఫారమ్ ఉన్నాయి.

ఆ మందలో తనవాళ్ళు ఎవరేనా ఉన్నారా అని మేనేజరుగారు చూశారు.

పింఛనుదారులకు ఒక్క రోజులోనే ఋణాలిప్పించి, నోరులేనివాళ్ళను దోచుకుంటున్న ప్రబుద్ధుడు అందరికన్నా ముందు మేనేజరుగారికి కనిపించాడు.

"ఇప్పటికే ఆలస్యమయింది. మీ అందరికీ నిమిషాలలో చెల్లింపులు చేయిస్తాను. రండి" అన్నారు మేనేజరుగారు.

"అహేయ్! అడ్డులేవయ్యా ముసిలాడా! మమ్మల్ని ఆపడానికి నువ్వెవడివేస్" అన్నాడు లోన్లిప్పించే ధర్మాత్ముడు.

ఆ పెద్దమనిషి ద్వారానికి అడ్డంగా నిలుచున్న మూర్తిని బలంగా ముందుకు తోశాడు. మూర్తి చేతిలోని కఱ్ఱ కింద పడిపోయింది. అతను నేలమీద పడ్డాడు.

మందు కొనుక్కోడానికి డబ్బులు లేనివాళ్ళు, కోడళ్ళు గడప తొక్కనివ్వని వాళ్ళు, కొడుకులు ఇళ్ళ నుంచి తగలేసేవాళ్ళు, ఆ పూటకు తిండికి లేనివాళ్ళు లబోలబోమని ముందుకు పోయారు.

సిలువ భుజాన వేసుకున్న కాపరిని తోసుకొని, తొక్కుకొని మందలోని ప్రతి గొఱ్ఱె ఎరవేపు దుమికింది.